కమనీయం.. సీతారాముల కల్యాణం

బుట్టాయగూడెం : శ్రీరామనవమి వేడుకలు గురువారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. గిరి పల్లెలతోపాటు సీతారాముల కల్యాణాన్ని పలు దేవాలయాల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారామ కల్యాణాన్ని తిలకించడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. నవమికి ప్రత్యేకతగా ఉన్న పానకాన్ని గుడి దగ్గరకు వచ్చిన భక్తులు సేవించారు. మండలంలోని దుద్దుకూరులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు సీతారాముల కల్యాణం జరిపించారు. కృష్ణాపురం రామాలయం వద్ద జరిగిన వేడుకల్లో ఎస్సై ఎం.జయబాబు, జ్యోతి దంపతులు సీతారామ కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ఎంపీపీ స్కూల్ సమీపంలోగల రామాలయంలో, దొరమామిడి, రెడ్డిగణపవరం, ముప్పినవారిగూడెం, తెల్లంవారిగూడెంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

చెట్లు మానులను దేవుళ్లుగా చేసి..

మారుమూల గ్రామమైన లక్ష్మీపురంలో నాయక్‌పోడు గిరిజనులు వారి తరతరాలుగా వస్తున్న ఆచారాన్ని కొనసాగిస్తూ వచ్చారు. అడవి నుంచి సేకరించిన చెట్ల మానులను సీతారామ లక్ష్మణులుగా తయారు చేసి ఘనంగా పూజలు చేశారు.

లింగపాలెంలో...

లింగపాలెం : మండలంలో గురువారం శ్రీరామనవమి వేడుకలు వాడవాడలా అత్యంత వైభవంగా జరిగాయి. గ్రామాల్లోని రామాలయాల వద్ద చలువ పందిళ్లలో అంగరంగ వైభవంగా నిర్వహించిన సీతారాముల కల్యాణాన్ని మహిళలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. లింగపాలెంలో పడమట రామాలయం వద్ద టీటీడీ లోకల్ అడ్వైజరి కమిటీ మెంబర్ బెంగుళూరు, లింగపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి (బీవీఎస్ రెడ్డి) ప్రసన్న కుమారి దంపతులు సీతారాముల కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా వారు నాలుగు పంచలోహ విగ్రహాలను ఆలయానికి అందజేశారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. లింగపాలెం, మఠంగూడెం గ్రామాల్లో జరిగిన కల్యాణాలకు మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు రావి కొండయ్య తదితరులు హాజరయ్యారు. ధర్మాజీగూడెంతోపాటు పలు గ్రామాల్లో భక్తులకు అన్నసమారాధన, తీర్థప్రసాదాలు, పానకం పంపిణీ చేశారు. రంగాపురంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా జరిపించారు.

కొయ్యలగూడెంలో...

కొయ్యలగూడెం : శ్రీ సీతారామ కల్యాణోత్సవం గురువారం మండల వ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కొయ్యలగూడెం శ్రీరామ్ నగర్ వాటర్ ట్యాంక్ రామాలయం వద్ద బ్రహ్మశ్రీ అని పెద్ది వెంకట నరసింహ శర్మ ఆధ్వర్యంలో సీతారాములకు కల్యాణం నిర్వహించారు. వైద్యులు సంకు మురళీకృష్ణ, నాగరత్న దంపతులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఎనిమిదవ వార్డు రామాలయం వద్ద 75వ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అన్న సమారాధన చేశారు. గావించారు.

ద్వారకాతిరుమలలో...

ద్వారకాతిరుమల: మండలంలో వాడవాడలా సీతారాముల కల్యాణ వేడుక గురువారం ఘనంగా జరిగింది. స్థానిక చెరువు వీధిలో రెండు ప్రాంతాల్లో, గుడిసెంటర్‌లో, మావులేటి సోమరాజు సదనం వద్ద సీతారాముల కల్యాణాన్ని కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు పానకంతో పాటు, తీర్థప్రసాదాలను అందజేశారు. చెరువు వీధిలోని పురాతన ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిపారు.

చింతలపూడిలో...

చింతలపూడి : శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా మండలంలో సీతారాముల కల్యాణాన్ని గురువారం అత్యంత వైభవంగా జరుపుకున్నారు. రామనామ జపంతో రామాలయాలు మార్మోగిపోయాయి. స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయంలో భద్రాచలంలో కల్యాణం నిర్వహించే సమయానికే సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. మండలంలోని రాఘవాపురం, యర్రంపల్లి, ప్రగడవరం, సీతానగరం, రేచర్ల గ్రామాల్లో, పట్టణంలోని వెలమపేట, ఫైర్‌స్టేషన్ సెంటర్, పాత బస్టాండ్, మెరకవీధి, ఆలపాటి కాంప్లెక్స్, షిరిడీ సాయి ఆలయాల వద్ద సీతారాముల కల్యాణాలను జరిపించి భక్తులకు పానకాలు పోశారు.

యర్రగుంటపల్లిలో...

చిన్న భద్రాద్రిగా పిలవబడుతున్న యర్రగుంటపల్లి గ్రామంలోని రాముడి గట్టుపై వేంచేసి ఉన్న సీతారాములకు అంగరంగ వైభవంగా కల్యాణం జరిపించారు. భక్తుల జంటలు పీటలపై కూర్చొని స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. సీతారాముల విగ్రహ మూర్తులను గ్రామం నుంచి ఊరేగింపుగా రాముడి గట్టు వద్దకు తీసుకువచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రామ భక్తులు కల్యాణాన్ని తిలకించడానికి తరలివచ్చారు. శ్రీరామ నవమి సందర్భంగా 10 వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు.

పోలవరం రూరల్ : పోలవరం మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం రామాలయాలను మామిడి తోరణాలు, పూలతో అలంకరించి సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని కల్యాణ మహోత్సవాలను తిలకించారు.

జంగారెడ్డిగూడెం: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో గల శ్రీదాసాంజనేయ స్వామి ఆలయంలో సీఐ బాల సురేష్‌బాబు దంపతులు గురువారం శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దెత్తున అన్నదానం చేశారు. డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఎస్సై సాగర్‌బాబు, ఏఎస్సై సంపత్ కుమార్ అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. స్టేషన్ సర్కిల్ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, గ్రామస్థులు

దిక్సూచిగా రామాయణం

జంగారెడ్డిగూడెం : మనిషి జీవన విధానానికి రామాయణం దిక్సూచి అని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. పట్టణంలోని శ్రీసీతారామస్వామి (వైకుంఠ రాముడు) ఆలయంలో గురువారం సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహించారు. మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి స్వామివారి కల్యాణానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ తండ్రిమాట నిలబెట్టాలని తపన పడే కొడుకుగా శ్రీరామచంద్రుడు, భర్త ఏ పరిస్థితుల్లో ఉన్నా భర్త వెంటే వెళ్లిన భార్యగా సీతమ్మ తల్లి, అన్నతోనే లోకం అన్నట్లు శ్రీరామచంద్రుడితో పాటు అడవులకు వెళ్లిన లక్ష్మణుడు, అన్నకి విధేయుడిగా ఉంటూ సింహాసనం ఇచ్చినా కాదనుకుని అన్న పాదరక్షలతో పాలన చేసిన తమ్ముడు, స్వామి భక్తిని తెలియజేస్తూ కనిపించే ఆంజనేయుడు ఇలా మానవ జీవనంలో ఉన్న విలువలను రామాయణం తెలియజేస్తోందన్నారు. అనంతరం పట్టణంలోని శ్రీసీతారామ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.కోటి మంజూరైందని, త్వరలో నిర్మాణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆలయానికి పాలక మండలి కోసం ప్రతిపాదనలు పంపించినట్లు చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, చిన్న దంపతులు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, నాయకులు, ఆలయ ఈవో సుజన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


సీతారామస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా


లింగపాలెంలో పడమటి రామాలయం వద్ద స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


కొయ్యలగూడెం శ్రీరామ్ నగర్‌లోని ఆలయంలో కల్యాణం


ద్వారకాతిరుమల చెరువు వీధిలో నిర్వహిస్తున్న రాములోరి కల్యాణం


యర్రగుంటపల్లిలో సీతారాముల కల్యాణం జరుపుతున్న దృశ్యం

జగనన్నే మా భవిష్యత్తు

కొయ్యలగూడెం : మంగపతిదేవిపేట గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయాల మండల కోఆర్డినేటర్ నూకల రాము మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు లక్షల 70 వేల మంది వలంటీర్లు, ఐదు లక్షల 50 వేల మంది గృహ సారథులు కలిపి రానున్న ఎన్నికల సమరంలో కీలక భూమిక పోషించాలి అన్నారు. ఈ సందర్భంగా సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి పేర్కొన్నారు. ప్రతి గడప గడపకు తిరుగుతూ సంక్షేమ పథకాల వల్ల ప్రజలు సంతృప్తి చెందారా లేదా అన్నది తెలుసుకొని వారి అభీష్టం మేరకు జగనన్నే మా భవిష్యత్తు పోస్టర్లను, స్టిక్కర్లను అంటించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, మాజీ సర్పంచ్ ఎంపీటీసీ తేలే శ్రీనివాస్, పార్టీ నాయకులు చిడిపి రవి, చిడిపి వెంకటరమణ, జక్కు గోపాలం, చిడిపి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నూకల రాము

జూనియర్ కళాశాలకు మైక్‌సెట్ అందజేత

చింతలపూడి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు గురువారం లయన్స్ సభ్యులు మైక్‌సెట్ అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ సభ్యులు మాట్లాడుతూ, చింతలపూడి లయన్స్‌క్లబ్, క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ ఎంజేఎఫ్ లయన్ జంగా చెన్నకేశవరెడ్డి ఆర్థిక సహాయంతో రూ. 11వేలు విలువైన మైక్ సెట్‌ను కళాశాలకు అందజేసినట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ సైకలాబ్ లయన్స్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గోలిచంద్రశేఖర్‌రెడ్డి, చిల్లపల్లి మోహనరావు, విజయలక్ష్మి, ఖాజా మొహిద్దీన్, సయ్యద్ మరియం, పక్కాల వెంకటేశ్వరరావు, ఎస్ గాంధీ, అధ్యక్షులు భగవాన్ శంకర్, కె.కేశవ్, జి.రాజేష్‌నాయుడు పాల్గొన్నారు.


చింతలపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మైక్‌సెట్‌ను అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

సీఎం జగన్ పాలనలో మహిళా సాధికారత

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలు సాధికారత సాధిస్తున్నారని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. ప్రపంచ మహిళ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా, అమ్మఒడి, జగనన్న చేయూత తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. ఉద్యోగ, రాజకీయ పదవుల్లో 50 శాతం మహిళలకే అందించారన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్, ఉపాధి హామీ పథకంలో పనిచేస్తోన్న సుమారు 28 మంది మహిళ ఉద్యోగులకు ఆయన చీరలు బహూకరించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ బి.ప్రణవి, ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి, ఎంఈఓ సబ్బిత నరసింహమూర్తి, పీఆర్ఏఈ కృష్ణమోహన్, ఏపీఓ కిషోర్ తదితరులు పాల్గొని మహిళ గొప్పతనాన్ని కొనియాడారు.


మహిళా ఉద్యోగులకు చీరలు అందిస్తున్న దృశ్యం

కార్మిక సంక్షేమ చట్టాలను అమలు చేయాలి

ఏలూరు (టూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మిక సంక్షేమం కోసం ఉన్న చట్టాలను అమలు చేయాలని ఎమ్మెల్సీ షేక్ సాబ్జి కోరారు. స్థానిక అన్నే భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభ ప్రత్యేక సంచికను గురువారం ఆయన విడుదల చేశారు. రాష్ట్రంలో 65 శాతం మంది వ్యవసాయం ఆధారంపై జీవిస్తున్నారన్నారు. యాంత్రీకరణ పెరగడంతో పనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు. ఉపాధి హామీ పథకానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులు తగ్గించడంతో ఉపాధి కూలీలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. యంత్రాలతో పనిచేయించడం వల్ల ఉపాధి కూలీలకు కనీస వేతనాలు అందడం లేదని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి మాట్లాడుతూ వ్యవసాయ రంగం అభివృద్ధి, ఉపాధి హామీ, భూమి, వలస కూలీలు, మహిళా వ్యవసాయ కార్మికులు, విద్యా, వైద్యం తదితర అంశాలపై గతంలో నిర్వహించిన మహాసభలో చర్చించామన్నారు. ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ సమావేశం

ఏలూరు రూరల్: ఏలూరు మండలం చాటపర్రులోని డాక్టర్ కాంచనమాల కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు తేరా ఆనంద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి హాజరౌతారని వెల్లడించారు. పార్టీ శ్రేణులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొంటారని తెలిపారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

చింతలపూడి : మండలంలోని రేచర్ల గ్రామంలో మైత్రి డెవలపర్స్ సౌజన్యంతో రూ.7 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ డా బి.రాంబాబు నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడారు. నియోజకవర్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న మైత్రి డెవలపర్స్ అధినేత భీమిరెడ్డి వెంకట సూరారెడ్డిని అభినందించారు. ముఖ్యంగా అవసరమైన చోట లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడం అభినందనీయమన్నారు. వాటర్ ప్లాంట్ దాత బీవీఎస్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఫ్లోరైడ్ వాటర్ ఉన్న గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్‌లు నిర్మించి ఇస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ మొలుగుమాటి నీరజా సుధాకర్, ఎంపీపీ డా.బి రాంబాబు నాయక్, మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయాబాబు, సర్పంచ్ కె.శివరామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ తుమ్మూరి వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సొంగా సందీప్, వైస్ సర్పంచ్ బాలకృష్ణ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు నరుకుళ్ళ సుబ్బారావు, గుత్తా మాధవరావు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


రేచర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

శ్రీవారి క్షేత్రంలో రామయ్య కల్యాణం

ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం గురువారం నేత్రపర్వంగా జరిగింది. శ్రీరామ నవమిని పురస్కరించుకుని స్వామివారి నిత్యకల్యాణ మండపంలో ఒకే వేదికపై శ్రీవారు, అమ్మవార్లకు, అలాగే సీతారాములకు నిర్వహించిన కల్యాణ వేడుక ఆద్యంతం భక్తులను పరవశింపజేసింది. ముందుగా ఆలయంలో తొళక్క వాహనంపై సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామివారి ఉత్సవ మూర్తులను ఉంచి అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా వాహనం క్షేత్ర పురవీధులకు పయనమైంది. ప్రతి ఇంటి ముంగిట స్వామి, అమ్మవారికి భక్తులు నీరాజనాలను సమర్పించారు. అనంతరం తిరిగి ఆలయానికి చేరుకున్న సీతారాములను నిత్యకల్యాణ మండపంలో చినవెంకన్న, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లతో పాటు, మరో రజిత సింహాసనంపై వేంచేసి, అర్చకులు కల్యాణ తంతును ప్రారంభించారు. సుముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేశారు. ఆ తరువాత మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలను వైభవోపేతంగా నిర్వహించారు. రాత్రి తొళక్క వాహనంపై సీతారాముల గ్రామోత్సవం అట్టహాసంగా జరిగింది.


తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధులకు పయనమైన సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామివారు

వడ్డీ మినహాయింపు సద్వినియోగం చేసుకోండి

జంగారెడ్డిగూడెం : ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, కుళాయి పన్నులు వంటివి చెల్లించేందుకు మార్చి 31వ తేదీ ఆఖరు కావున , బకాయిలు ఉన్న జంగారెడ్డిగూడెం పట్టణ ప్రజలు వెంటనే పన్నులు చెల్లించాలని కమిషనర్ పి.భవానీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తర్వుల మేరకు శుక్రవారంలోగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీ మినహాయింపు ఇవ్వడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రజలు మున్సిపల్ కార్యాలయంలో గాని, మీసేవ ద్వారా గాని, నగర్ యాప్ ద్వారా గాని పన్నులు చెల్లించాలన్నారు. మార్చి 31వ తేదీ రాత్రి 12 గటల వరకు పన్నులు కట్టించుకోవడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు

ద్వారకాతిరుమల : రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడడానికి కారణమైన ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం. మండలంలోని ఎం.నాగులపల్లికి చెందిన మరీదు పోతురాజు ఈనెల 29న మోటార్‌సైకిల్‌పై ద్వారకాతిరుమలకు వెళుతున్నాడు. ఈ సమయంలో వెనుక నుంచి వచ్చిన ఒక ఆటో ఇతడి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ పోతురాజును స్థానికులు 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

కామవరపుకోట : వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారిని కె.శ్రీదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. మండలంలోని అధికారులు, మహిళా మండల సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఏజెన్సీ బంద్

బుట్టాయగూడెం : బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని రద్దు చేయాలని కోరుతూ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఏజెన్సీ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బంద్‌కు వ్యాపార సంస్థలు, పాఠశాలలు, ఉద్యోగులు, ప్రజలు సహకరించాలని జేఏసీ చైర్మన్ మొడియం శ్రీనివాస్ కోరారు. అలాగే జీలుగుమిల్లి మండలంలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో బంద్ జయప్రదం చేయాలని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులను గిరిజన సంఘం నాయకులు కోరారు.

లింక్ డాక్యుమెంట్ దస్తావేజు పోయినది

నా క్లయింటు చనమల పిచ్చియ్య గారి కుమారుడు చనమల వెంకటేశ్వరరావు గారి ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెం.7907/2012 లో గల ఆర్.యస్.నెం.302/1 గల దస్తావేజు పోయినది. గ్రామం తాడువాయి, జంగారెడ్డి గూడెం మండలం, డోర్ నెం.2-115 **హద్దులు** : **తూర్పు:** పాపోలు వెంకటేశ్వరరావు గారి స్థలం, **దక్షిణం** : మా తాలూకా స్థలం, **పడమర** : జిల్లా పరిషత్ రోడ్డు, **ఉత్తరం** : మా తాలూకా స్థలం చనమల లక్ష్మి గారి స్థలం. **పార్టీ వివరములు** : చనమల వెంకటేశ్వరరావు తండ్రి పిచ్చియ్య, డోర్ నెం.2-115 తాడువాయి, జంగారెడ్డిగూడెం మండలం.

సం/- మట్టా శ్రీనివాసరావు
అడ్వకేట్ & నోటరీ, జంగారెడ్డిగూడెం
సెల్ : 9399990586

విశేషాలు

క్లుప్తంగా

నేడు కౌన్సిల్ సమావేశం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.భవానీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షత వహిస్తారన్నారు.

30వ డివిజన్ కార్పొరేటర్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

ఏలూరు టౌన్: ఏలూరు 30వ డివిజన్ కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వరరావుపై సస్పెన్షన్ ఎత్తివేసినట్టు వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఆరు నెలలుగా వైఎస్సార్‌సీపీ నిబంధనలు పాటిస్తూ క్రమశిక్షణతో మెలుగుతూ ఉన్నారని తెలిపారు. ఉమామహేశ్వరరావు ఇకపై కార్యక్రమాల్లో యథావిధిగా పాల్గొంటూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని వివరించారు.

ఇఫ్టూ మహాసభల కరపత్రం విడుదల

ఏలూరు (టూటౌన్): వచ్చే నెల 16, 17,1 8 తేదీల్లో తిరుపతిలో నిర్వహించే ఐఎఫ్‌టీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మహాసభల కరపత్రం గురువారం విడుదల చేశారు. ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మహాసభల వివరాలను వెల్లడించారు. కేంద్రంలోని ప్రధాని మోదీ, అమిత్ షాల ప్రభుత్వం ఫాసిస్టు ధోరణులకు వ్యతిరేకంగా కార్మిక వర్గం సమరశీల ఉద్యమాలను చేపట్టాలన్నారు. పలువురు కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నారాయణ స్వామి మృతి తీరని లోటు

ఏలూరు (టూటౌన్): మాజీ మంత్రి యర్రా నారాయణ స్వామి మృతి జిల్లా రాజకీయాలకు, ప్రజలకు తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి నారాయణ స్వామి అని కొనియాడారు. నారాయణ స్వామి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు.


పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీస్

పెదవేగి : పెదవేగి మండలం అమ్మపాలెం పంచాయతీ కార్యదర్శికి షో కాజ్ నోటీసు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి జీవీ మల్లిఖార్జునరావు గురువారం సాయంత్రం తెలిపారు. అమ్మపాలెం పంచాయతీ నిధులు సుమారు రూ .లక్షా 60 వేల కార్యదర్శి కిషోర్ తన బంధువుల ఖాతాలకు బదిలీ చేయడానికి ప్రయత్నించారనే ఆరోపణలపై జిల్లా అధికారులు విచారణ నిర్వహించారు. ఈ విచారణలో కార్యదర్శి కిషోర్‌పై ఆరోపణలు నిరూపితం కావడంతో కార్యదర్శికి డీపీఓ మల్లిఖార్జునరావు షోకాజ్ నోటీస్ జారీ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెదవేగి : చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై ఎం.లక్షణ్ తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన గురజాల గాంధీ (50) గత నెల 22న రామచంద్రపురంలోని తన తోటలో ఎండిన చెట్టును నరుకుతుండగా చెట్టుపై నుంచి జారీ కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శ్రీపాటెమ్మ తల్లికి పూజలు


విశేషాలంకరణలో శ్రీ పాటెమ్మ తల్లి

దెందులూరు : చల్లచింతలపూడిలోని శ్రీ పాటెమ్మ తల్లికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ యలమర్తి శ్రీనివాసరావు, పెరుగ్గూడెం మాజీ సర్పంచ్ హేమలత శ్రీ పాటెమ్మ తల్లికి 20 కాసుల బంగారం, వెండితో మంగళసూత్రం, కిరీటం, వడ్డాణం, పెద్ద ముక్కుపుడక, త్రిశూలం, నేత్రాలు తయారుచేయించి వాటితో అమ్మవారిని అలంకరించారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులతో కలిసి చైర్మన్ దంపతులు శ్రీ పాటెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు.

కోతుల బెడదతో బెంబేలు

ఉంగుటూరు : ఉంగుటూరు గ్రామంలో కోతుల ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. వాటిని కొడితే ఎదురుతిరిగి దాడి చేస్తున్నాయి. ఈ పరిస్థితి గత నెలా పదిహేను రోజులుగా నెలకొని ఉంది. దీనిపై గ్రామ పంచాయతీ పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామంలో 200కు పైగా కోతులు సంచరిస్తున్నాయి. వంట గదిల్లోకి చొరబడి కూరగాయలు, తినుబండారాలు పట్టుకుపోతున్నాయి. మహిళలు, పిల్లలు వీధుల్లో తిరగడానికి భయపడుతున్నారు. పొరుగు గ్రామాలనుంచి వానరాలను తీసుకువచ్చి వదిలేయడం వలనే ఇన్ని కోతులు పెరిగిపోయాయని అంటున్నారు. కోతుల బారినుంచి రక్షించాలని గ్రామప్రజలు కోరుతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పోలవరం డివిజన్
9951602915 (పోలవరం)
9505508399 (చింతలపూడి)
Office mail : tpgadvt@gmail.com